సాక్షి ప్రకాశం

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



నేడు రామతీర్థం గంగమ్మ తిరునాళ్ల

చీమకుర్తి మండలం రామతీర్థంలోని గంగమ్మ తల్లి తిరునాళ్ల శనివారం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. 6 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు.

- 10లో..



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యమని మంత్రి సత్యకుమార్ అన్నారు.

- 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39/28

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

చేతికొచ్చిన బొప్పాయి నేలపాలు

● గాలీ, వాన బీభత్సంతో పంట నష్టం



మద్రిపూడిలో అకాల వర్షానికి నేలపాలైన బొప్పాయిపంట

మద్రిపూడి: మండలంలో గురువారం గాలీ, వాన బీభత్సం సృష్టించింది. విపరీతమైన గాలి, వర్షంతో కూడిన గాలులు వీచడంతో అందివచ్చిన బొప్పాయి పంట నేలపాలైంది. మండలంలో 100 ఎకరాల్లో బొప్పాయి పంట సాగుచేశారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో బొప్పాయి పంట నేలకు ఒరిగింది. మండలంలో కాకర్ల, పన్నూరు, మద్రిపూడి, తంగెళ్ల, అంకేపల్లి, తదితర గ్రామాల్లో బొప్పాయి పంట సాగుచేశారు. అత్యధికంగా పన్నూరులో 65 ఎకరాలు సాగుచేశారు. మద్రిపూడి కొండపాలెంలో సందల నర్సారెడ్డి అనే కౌలు రైతు 4 ఎకరాలల్లో బొప్పాయి సాగు చేశాడు. పంట కోతకు రావడంతో మరో రెండు రోజుల్లో కాయలు కోస్తామనుకున్న తరుణంలో గురువారం వర్షంతో కూడిన గాలులు వీచడంతో మూడు ఎకరాలు పూర్తిగా పంట దెబ్బతినిందని, ఎకరా పొలం మాత్రం పాక్షికంగా దెబ్బతిందని బాధితుడు తెలిపాడు. అకాల వర్షం కారణంగా సుమారు రూ.6 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు నర్సారెడ్డి పేర్కొన్నాడు.

నేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ రెండో శనివారం సెలవు అయినా పనిచేస్తాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) వి.పుష్పలత తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నేడు పని చేస్తాయన్నారు.

ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు గాలికొదిలేశారు. ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన పలు వాహనాలను ఆర్టీఓ రిజిస్ట్రేషన్ చేయించకపోవడం, సకాలంలో పన్నులు కట్టకపోవడంతో లక్షలాది రూపాయలు పెనాల్టీలు చెల్లిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు రూ.11 లక్షలు పెనాల్టీల రూపంలో చెల్లించారు. కమిషన్ల కోసమే అధికారులు సొంత వాహనాలపై నిర్లక్ష్యం వహిస్తూ ప్రైవేటు ట్యాంకర్లకు లక్షలు ధారపోస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఫిల్టర్ బెడ్ వద్ద ఉంచిన మున్సిపల్ వాటర్ ట్యాంకర్

కమీషన్లు రయ్యి మనీ!

- ఆర్టీఓకు సకాలంలో వాహనాల పన్నులు చెల్లించని ఒంగోలు కార్పొరేషన్
- అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ రూ.11 లక్షలు పెనాల్టీలు చెల్లింపు
- రికార్డులు లేకపోవడంతో వాటర్ ట్యాంకర్ సీజ్ చేసిన ఆర్టీఓ అధికారులు
- రెండో ట్యాంకర్‌ను దాచేసిన అధికారులు
- మరోసారి చర్చనీయాంశంగా మారిన అధికారుల వ్యవహారం
- సొంత వాహనాలు ఉన్నా ప్రైవేటు ట్యాంకర్లకు నెలకు రూ.24 లక్షలు చెల్లింపు
- కమీషన్ల కోసమే అంటూ ఆరోపణలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో ఖజానాకు భారీగా తూట్లు పడుతోంది. పెనాల్టీల రూపంలో ప్రజాధనం వృథా అవుతోంది. నగరపాలక సంస్థ పరిధిలో అధికారుల వాహనాలు మొదలుకొని ఇంజినీరింగ్ విభాగంలో అనేక రకాల వాహనాలు ఉన్నాయి. వీటికి సంబంధించి సకాలంలో పన్నులు చెల్లించడం లేదు. దీంతో రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేసినప్పుడు పలు మార్లు కార్పొరేషన్ వాహనాలను సీజ్ చేశారు. పెనాల్టీల రూపంలో రూ.8 లక్షలు ఒకసారి, రూ.3 లక్షలు ఒకసారి రవాణాశాఖకు చెల్లించారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రజాధనం వృథాగా పోతోంది.

మూడేళ్లుగా నో రిజిస్ట్రేషన్

నగరపాలక సంస్థలో నీళ్ల సరఫరాకు సంబంధించి రెండు వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. 2021–22వ సంవత్సరంలో ఎస్ క్యాప్ నిధులతో వాటిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లను రవాణా శాఖ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించారు. వాటికి జత చేసిన 2 ట్రక్కులకు మాత్రం రిజిస్ట్రేషన్ చేయించలేదు. సాధారణంగా ఇంజన్‌కు రిజిస్ట్రేషన్ చేస్తే ఒక నంబరు మాత్రమే వస్తుంది. అదే ట్రక్కు, ట్రాక్టర్ ట్యాంకర్లకు రిజిస్ట్రేషన్ చేస్తే రెండు నంబర్లు వస్తాయి. కానీ ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు మాత్రం ట్రక్కులు బిగించిన ట్రాక్టర్లు చట్ట విరుద్ధంగా రోడ్డు మీద తిప్పుతున్నారు.

ప్రైవేటు ట్రాక్టర్లకు రోజుకు రూ.80 నుంచి రూ.90 వేల వరకు చెల్లింపు

ఒంగోలు నగరంలో శివారు ప్రాంతాల ప్రజలకు మంచి నీరు సరఫరా చేసేందుకు ప్రతి రోజూ ప్రైవేటు ట్రాక్టర్ ట్యాంకర్ల యజమానులకు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు చెల్లిస్తున్నారు. 45 ట్రాక్టర్లు ప్రతి రోజూ 225 నుంచి 240 ట్రిప్పుల వరకు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. నగర పాలక సంస్థ టెండర్ ఎస్టిమేషన్ ప్రకారం ఒక్కో ట్యాంకర్ ట్రిప్పునకు రూ.356 చెల్లిస్తుంది. ఈ విధంగా ప్రైవేటు ట్యాంకర్లకు రోజుకు రూ.80 వేలు చెల్లిస్తుంటే మొత్తం మీద కనీసం నెలకు రూ.24 లక్షలు చెల్లిస్తున్నారు. మరి నగర పాలక సంస్థకు ఉన్న రెండు ట్రాక్టర్‌లకు సంవత్సరానికి కట్టాల్సిన పన్నులు ఎందుకు కట్టడం లేదన్న ప్రశ్నలను అధికారుల వద్ద నుంచి సరైన సమాధానం రావడం లేదు. సొంత వాహనాలకు సకాలంలో పన్నులు చెల్లించి తిప్పితే ప్రైవేటు వాహనాలకు చెల్లించాల్సిన మొత్తం తగ్గుతుంది. కమీషన్ల కోసమే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారంటూ కార్పొరేషన్ వర్గాల్లోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన రవాణా శాఖ అధికారులు

ఇటీవల నగరంలో రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా ఒంగోలు నగర పాలక సంస్థకు చెందిన ఏపీ 39 యుఆర్ 7561 నంబరుగల ట్రాక్టర్ రికార్డులను చూపించాలని అధికారులు డ్రైవర్‌కు అడిగారు. అయితే డ్రైవర్ నోర్లెళ్లబెట్టాడు. వెంటనే దానిని వెంగముక్కల పాలెం రోడ్డులోని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) కార్యాలయ ప్రాంగణానికి తరలించారు. సీజ్‌చేసి రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్‌తో పాటు ఇతర పెనాల్టీలు కట్టి తీసుకెళ్లాలని ఒంగోలు కమిషనర్ కే.వెంకటేశ్వరరావుకు నోటీసులు పంపారు. ఒక వాహనాన్ని పట్టుకున్నారని తెలుసుకున్న కమిషనర్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మున్సిపల్ ఇంజినీర్ పరిస్థితిని సమీక్షించారు. పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న రెండో ట్రాక్టర్‌ను రంగారాయుడు చెరువు సమీపంలోని మంచినీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ వద్ద ఎవరికీ కనపడకుండా దాచేశారు.



డీటీసీ కార్యాలయానికి తరలించిన వాటర్ ట్యాంకర్

అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన పూలే



పూలేకి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, చుండూరి రవిబాబు తదితరులు

- ఘనంగా జ్యోతీరావుపూలే 199వ జయంతి వేడుకలు
- పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: పేదలు, బహుజనులు, గిరిజనుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి జ్యోతీరావు పూలే అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జ్యోతీరావు పూలే ఉద్యమకారుడు, సంఘసంస్కర్త అని కొనియాడారు. ఇటువంటి నాయకులు చేసిన సేవను గుర్తించుకొని మా నాయకుడు కూడా బహుజనులు, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పూలేను ఎప్పటికీ గుర్తు పెట్టుకొని పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ విద్యావ్యాప్తి ద్వారా సాంఘిక అసమానతలు తొలగిపోతాయని జ్యోతీరావుపూలే భావించాడనీ, ఆయన అడుగు జాడల్లో అందరం నడుద్దామన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, మహిళా విభాగం పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, బడుగు ఇందిర, వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ల రామారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, సాధం విజయలక్ష్మి, దాసరి కరుణాకర్, పిగిలి శ్రీను, కోటి యాదవ్, పి.ఆంజనేయులు, దుంపా చెంచిరెడ్డి, మహానందరెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, గౌడ్, బొట్ల మాల్యాద్రి, బొడ్డు వేణు, భాను, పుసమర్తి బాబు, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

- 61 రోజుల పాటు వేట నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో చేపలవేట చేస్తున్న యాంత్రిక పడవలు, మోటారు బోట్లు ద్వారా నిర్వహించే అన్ని రకాల చేపల వేట ఈ నెల 15వ తేదీ నుంచి నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జూన్ 14వ తేదీ వరకు అంటే మొత్తం 61 రోజుల పాటు వేటను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం ముఖ్య ఉద్దేశ్యం వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడమే నన్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మోటారు బోట్లపై మత్స్య కారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిబంధనలు అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత్స్యకారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ కేసులు ఎత్తేయాలని జర్నలిస్టుల నిరసన

- సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం 'సాక్షి' దినపత్రికపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ 'సాక్షి' ఎడిటర్ ఆర్ ధనుంజయరెడ్డితోపాటు మరో ఆరుగురు సాక్షి రిపోర్టర్లపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. చంద్రబాబు రెడ్‌బుక్ అరాచకాలను వెలుగులోకి తెస్తున్న సాక్షి పత్రికపై వ్యవహరిస్తున్న కక్షపూరిత విధానాలను విడిచిపెట్టాలన్నారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని పశువేములకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త హరిశ్చంద్రను టీడీపీ వర్గీయులు హత్యచేసిన విషయాన్ని సాక్షిలో ప్రచురించినందుకు కూటమి ప్రభుత్వం కక్ష కట్టి సాక్షి ఎడిటర్‌తోపాటు మరో ఆరుగురిపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని మార్కాపురం ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఓప మల్లిక్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ డిమాండ్ చేశారు. మార్కాపురం ప్రెస్‌క్లబ్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పాత్రికేయుడు ఓప మల్లిక్ మాట్లాడుతూ ఒక దారుణాన్ని వెలుగులోకి తెచ్చిన సాక్షి పత్రికపై ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడాన్ని ఖండించారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధానాలను ప్రభుత్వం విడిచిపెట్టాలన్నారు. ఏదైనా వార్త నచ్చకపోతే ఖండన ఇవ్వవచ్చని, అలా కాకుండా కక్ష పూరితంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు. ఈరోజు సాక్షి కావచ్చు... రేపు మరో పత్రికకు కూడా ఇదే పరిస్థితి రావచ్చన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి ఇలాంటి సంఘటనలను ఎదుర్కోవాలన్నారు. పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందని చెప్పారు. పాత్రికేయులు అప్పటికప్పుడు వచ్చిన సమాచారాన్ని వెంటనే ప్రచురిస్తారని, ఇలాంటి వార్తలపై కూడా దారుణంగా ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం నమోదు చేసిన క్రిమినల్ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే భవిష్యత్తులో పాత్రికేయ వృత్తి ప్రమాదకర పరిస్థితుల్లో పడుతుందని అన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీ మోహన్‌రెడ్డి, సాక్షి ప్రతినిధులు జీఎల్ నరసింహారావు, డీ జగన్నాథరెడ్డి, బీ రామయోగి, బీ మల్లిఖార్జున్, ఎలక్ట్రానిక్ మీడియా అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాజీవలి, జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎస్‌కె అన్నూ, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ నాయకుడు వెన్న శ్రీనివాసరెడ్డి, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే బాబు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎస్‌కే మహబూబ్ సుభానీ, సయ్యద్ షాకీర్ హుస్సేన్, వేశపోగు రాజు, ఆదినారాయణ, మల్లిఖార్జున, నరేంద్ర, అనీల్‌కుమార్, బషీర్, ఓబయ్య, ఎస్ పోలయ్య, ఎస్‌కె కరీమ్, ఖలీల్, బూదాల సురేష్‌కుమార్, కల్లూరి వెంకటేశ్వర్లు, సీహెచ్ సొకత్, ఇమ్మడి శ్రీనివాసులు, ముకుందర్, ప్రకాష్, పవన్‌కుమార్, రాజ్‌కమల్, శేఖర్, వై శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కన్వీనరు సుదర్శన్, శ్రీధర సాయికుమార్, ఎస్ఎమ్ సుభానీ, జాన్సన్, పీయల్ నవీన్, టీ మల్లిఖార్జున పాల్గొన్నారు.

> **అక్రమ కేసులు ఎత్తివేయాలి**
>
> 
>
> రాష్ట్ర ప్రభుత్వం సాక్షి పాత్రికేయులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో 'సాక్షి'లో వచ్చిన వార్తపై పోలీసులు సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డితోపాటు మరో ఆరుగురు సాక్షి రిపోర్టర్లపై పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలా చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తలు నచ్చకపోతే ఖండన ఇవ్వవచ్చని, ఇలా కేసులు పెడితే భవిష్యత్తులో పాత్రికేయ వృత్తిలోకి ఎవరైనా రావాలంటే భయపడతారని అన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం గౌరవించాలని రమణ కోరారు.
>
> – ఎస్వీ రమణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు

పొగాకు రైతులపై ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

- ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలి
- పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి సురేష్

కొండపి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు రైతుల పట్ల మొద్దు నిద్ర విడనాడి పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేయాలని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా కొండపిలోని జెండా చెట్టు సెంటర్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు కొనుగోలు ప్రారంభం నుంచి రైతులకు ఆశించిన మేర బోర్డు వారు కొనుగోలు ప్రారంభించలేదని అన్నారు. ప్రస్తుత ధరలు ఏమాత్రం రైతులకు గిట్టుబాటు కల్పించేలా లేవని అన్నారు. పొగాకు కొనుగోళ్లలో ఇతర రాష్ట్రాల్లో కేజీ రూ.300 పైగా ధర పలుకుతుంటే, మన రాష్ట్రంలో సరాసరి రూ.250 పైగా పలుకుతున్నాయని అన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో ఎక్కువగా నో బిడ్స్ కనబడుతున్నాయని, రైతులు ఏదో ఒక ధరకు ఇచ్చేలా చేసే ప్రయత్నంలో పొగాకు బోర్డు వారు ఉన్నారని అన్నారు. పొగాకు ధరలు పెరుగుతాయని రైతులు ఎదురుచూస్తుంటే ధరలు మాత్రం రోజురోజుకూ దిగజారిపోతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్ర నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర కేజీ రూ.300 పైగా ఉంటే రైతులు అప్పుల ఊబిలో పడకుండా ఉంటారని, ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిస్థితి చేయి దాటకముందే ధరలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ముద్దు నిద్ర వీడి పొగాకు రైతులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేయకముందే ప్రభుత్వం జోక్యం చేసుకొని మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లో ఇదే పరిస్థితి ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.200 కోట్లు తీసుకొచ్చి పొగాకు ధరలను స్థిరీకరించారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ సొసైటీ ద్వారా రూ.200 నుంచి రూ.300 కోట్లు కేటాయించి పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు బోర్డు రైతుల పక్షాన నిలబడి గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, వైస్ ఎంపీపీ రావులపల్లి కోటరాజు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు షేక్ వన్నూరు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వసంతరావు, యువజన విభాగ అధ్యక్షుడు గంగాధర్, మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, బచ్చలకోటు, మండవ మాలకొండయ్య, దివి శ్రీనివాసరావు, పర్చూరి శ్రీనివాసరావు, మారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, గొరెడ్డి రమణారెడ్డి, నెన్నూరు పాడు రమణారెడ్డి, పరుచూరి సుబ్బయ్య, మోపర్తి నారాయణ, ఆరికట్ల హరినారాయణ, కోడిపిల్ల ప్రసాద్, శేషు, రాజబాబు, సాంబశివరావు, వినోద్, మహేష్, నజీర్, కోర్నేలు, యాకోబు, సుల్తాన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా కుదురుకున్నాకే ఆస్పత్రి అభివృద్ధి

- జీజీహెచ్‌లో 60 శాతం వైద్యులు, సిబ్బంది కొరత
- కొత్త మెడికల్ కాలేజీ నిర్వహణ పీపీపీ పద్ధతిలోనే..
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ఒంగోలు టౌన్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదురుకున్న తరువాత సర్వజన ఆస్పత్రి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ చెప్పారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. క్యాథ్ ల్యాబ్ పనితీరును కార్డియాలజిస్టు డాక్టర్ కుంచాల వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఐసీయూ వార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్యాథ్ ల్యాబ్ అందుబాటులోకి రావడం వలన స్టెంట్లు, యాంజియోప్లాస్టీల వంటివి వేయడానికి వీలు కుదురుతుందన్నారు. కార్డియాలజీ యూనిట్లో నలుగురు ఉండాల్సి ఉన్నా కేవలం ఒక్కరితోనే క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. జీజీహెచ్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. 31 మంది ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా 14 మంది మాత్రమే ఉన్నారని, 17 ఖాళీలున్నాయని తెలిపారు. 46 అసోసియేట్ ప్రొఫెసర్లకు గాను 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 128 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గాను 43 ఖాళీలు, 56 ట్యూటర్లకు గాను 51 ఖాళీలు ఉన్నాయని వివరించారు. 86 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ఉండాల్సి ఉండగా 73 ఖాళీలు, 613 టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు గాను 357 ఖాళీలున్నాయని తెలిపారు. మొత్తం మీద 60 శాతం ఖాళీలు ఉన్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీలో 65 శాతం ఖాళీలు ఉన్నాయని చెప్పారు. వైద్య సిబ్బంది సాయంత్రం పూట ఓపీలు పూర్తయ్యే వరకు పనివేళల్లో పూర్తిగా ఆస్పత్రిలోనే ఉండాలని, అత్యవసర కేసులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదుటపడ్డాక రాష్ట్రంలో ఉన్న 15 బోధనాస్పత్రులను బలోపేతం అయ్యేలా చూస్తామన్నారు. కొత్తగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్షియల్ స్కీమ్ తీసుకొచ్చామన్నారు. సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఇదిలా ఉండగా క్యాథ్ ల్యాబ్ ప్రారంభ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరిద్దరు మినహా పెద్దగా కనిపించలేదు. బీజేపీ నాయకులు మాత్రం బాగా హడావుడి చేశారు. అయితే బీజేపీలోని రెండు గ్రూపులు వేర్వేరుగా మంత్రిని కలిశారు.

రైతులను మోసగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

ఒంగోలు టౌన్: రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా మద్దతు ధరలను ప్రకటించి వారిని మోసగించడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ప్రభుత్వాల వల్లనే రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఈ ఏడాది రాష్ట్రంలో గత సంవత్సరం మిర్చి క్వింటాకు రూ.20 వేల నుంచి రూ.24 వేల ధర లభించగా, ఈ ఏడాది కేవలం రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే ధర వచ్చిందని, దీని వలన రైతులు చాలా నష్టపోతున్నారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.12 వేలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.11,780 ప్రకటించడం దుర్మార్గం అన్నారు. మిర్చి రైతుకు రూ.5 వేల బోనస్ ప్రకటించి స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేయాని డిమాండ్ చేశారు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.1500 మాత్రమే బోనస్ ప్రకటించిందన్నారు. దేశంలో కేరళ, తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలు వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు బోనస్ ప్రకటించడాన్ని గుర్తు చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయలేదని, కౌలు రైతు సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన చట్టాలను అమలు చేయడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ వస్తున్నా పంటల బీమా అమలు చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రుణపరిమితి వంటి రైతు సంక్షేమ పథకాలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల వలన పొగాకు రైతులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. నల్లబర్లీ గత ఏడాది క్వింటా రూ.18 వేలు ఉండగా ఈ ఏడాది రూ.3 వేలకే కొనుగోలు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో కోకో సాగును ప్రోత్సహించిన కంపెనీలు ఊరగాయ పెట్టుకోమంటూ ఎగతాళి చేస్తున్నాయని అన్నారు. పసుపు ధర కూడా పతనమైందని, మొక్కజొన్న, వరికి గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో

జిల్లా వాసులకు చోటు

ఒంగోలు సిటీ: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన వారిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర బీసీ సెల్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్ గా బొట్ల రామారావు, రాష్ట్ర స్టూడెంట్ వింగ్ సెక్రటరీగా జి.రవీంద్రనాథ్, రాష్ట్ర స్టూడెంట్ వింగ్ జాయింట్ సెక్రటరీగా పూనూరి సంజీవరెడ్డి, రాష్ట్ర ఇంటెలెక్చువల్ ఫోరం జాయింట్ సెక్రటరీగా మండవ కిరణ్‌కుమార్, స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీలుగా గుంటు పోలయ్య, పత్రా ఐజాక్ ను నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది.

పకడ్బందీగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు

● సబ్ కలెక్టర్ త్రివినాగ్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీదేవిభూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన సమీక్షించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కల్యాణోత్సవం నుంచి రథోత్సవం వరకు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి భక్తులు హాజరవుతున్న దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ డాక్టర్ నాగరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి చెప్పారు. సమీక్షలో ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు తహసీల్దార్ చిరంజీవి, అగ్నిమాపక అధికారి రామకృష్ణ, ఏఓ రవీంద్రారెడ్డి, ఎస్సై సైదుబాబు, విద్యుత్ డీఈ సియానాయక్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు కన్నుమూత


అబ్దుల్ మునాఫ్ (ఫైల్)

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో నివాసముంటున్న శతాధిక వృద్ధుడు షేక్ అబ్దుల్ మునాఫ్(101) శుక్రవారం కన్నుమూశారు. మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ మునాఫ్ 1924లో జన్మించారు. రోడ్డు భవనాల శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన 1987లో పదవీ విరమణ చేశారు. అబ్దుల్ మునాఫ్ తండ్రి అబ్దుల్ కరీంసాహెబ్, సోదరుడు షేక్ అబ్దుల్ జబ్బార్ సాహెబ్ పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచ్‌లుగా సేవలందించారు. అబ్దుల్ మునాఫ్‌కు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మండల కేంద్రంలోని ఖబరస్తాన్‌లో శుక్రవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రాక్టర్ కింద పడి క్లీనర్ మృతి


ఘటన స్థలంలో మృతుడు వెంకటకృష్ణ

పామూరు: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ టైర్ కిందపడి క్లీనర్ మృతిచెందిన సంఘటన మండలంలోని తిరగలదిన్నె పాఠశాల సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిరగలదిన్నె గ్రామంలో నిర్మిస్తున్న ఆలయానికి ట్రాక్టర్‌తో ఇటుకలు తోలుతున్నారు. ఇటుకలను అన్‌లోడ్ చేసి ట్రాక్టర్ వేగంగా తిరిగి వస్తూ రోడ్డుపై ఉన్న స్పీడ్‌బ్రేకర్ దాటి ఒక్కసారిగా కుదుపునకు గురైంది. ఆ సమయంలో డ్రైవర్ పక్కన మడ్గార్ రేకుపై కూర్చుని ఉన్న నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ క్లీనర్ పి.వెంకటకృష్ణ (45) జారి ట్రాక్టర్ ఇంజిన్ పెద్ద టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. కృష్ణ మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

గంగో రేణుక తల్లి

● నేడు రామతీర్థంలో గంగమ్మ జాతర
● ఆరు విద్యుత్ ప్రభల ఏర్పాటు
● తిరునాళ్లకు ముస్తాబైన గంగమ్మ, మోక్షరామలింగేశ్వరస్వామి దేవస్థానం


రామతీర్థం పుణ్యక్షేత్రంలో విద్యుత్ దీపాలంకరణలో గంగమ్మ తల్లి ఆలయం

చీమకుర్తి రూరల్:

దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి మండలం రామతీర్థంలోని గంగాబాలత్రిపురసుందరీ సమేత మోక్షరామలింగేశ్వరస్వామి దేవస్థానం పుణ్యక్షేత్రంలో గంగమ్మ తల్లి తిరునాళ్లను శనివారం అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో దేవదాయశాఖ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

పలు పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు...

రామతీర్థం పుణ్యక్షేత్రంలో గంగమ్మ తల్లి తిరునాళ్లను ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమి రోజు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ప్రాంతంలోని రైతులు పండించిన పంట ఇంటికి చేరే సమయంలో గంగమ్మ తిరునాళ్ల నిర్వహిస్తారు. గంగమ్మ తల్లిని పూజారులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు పొంగళ్లు పెట్టుకుని మొక్కుబడులు చెల్లించి ఉత్సవాలు నిర్వహిస్తారు. గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శనివారం రామతీర్థం పుణ్యక్షేత్రంలో పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆరు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. చీమకుర్తి నుంచి వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఒక్కో విద్యుత్ ప్రభ, చీమకుర్తి రూరల్‌లోని రాజుపాలెం, కంభంపాడు, బూదవాడ నుంచి మరో మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల కోసం పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. 12వ తేదీ ఉదయం నుంచి 13వ తేదీ ఉదయం వరకు బస్సులు నడుస్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

భారీగా అన్నదానాలు...

తిరునాళ్ల సందర్భంగా ప్రతి సామాజిక సత్రం ఆధ్వర్యంలో భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ప్రతినిధులు మంచినీరు, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంగోలు డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు.

రామతీర్థం తిరునాళ్ల సందర్భంగా ముందు రోజు చీమకుర్తి పట్టణంలో నిర్వహించే మందిరాల సంబరాలు శుక్రవారం రాత్రి అంబరాన్నంటాయి. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, ఆర్యవైశ్య సంఘాల తరఫున నిర్మించిన మందిరాలు, వాటిపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.


వైఎస్సార్ సీపీ మందిరంపై యాంకర్లు, డ్యాన్సర్ల సందడి


వైఎస్సార్ సీపీ మందిరం వద్ద భారీగా ఉన్న ప్రేక్షకులు

చట్టసభల్లో బీసీలకు వైఎస్ జగన్ ప్రాధాన్యత

● పూలే జయంతి సభలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్


కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

కొండపి: బీసీల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ హయాంలో సముచిత ప్రాధాన్యం దక్కిందని, బీసీను బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌గా కాకుండా బ్యాక్ బోన్ క్లాస్‌గా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుర్తించారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వసంతరావు ఆధ్వర్యంలో కొండపిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీసీల్లోని అన్ని ఉపకులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సామాజిక న్యాయాన్ని సాకారం చేయడమే కాకుండా బీసీల్లో అత్యధిక మందిని చట్టసభలకు పంపిన అభినవ పూలే వైఎస్ జగన్ అని కొనియాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను బూటకపు హామీలతో మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదని, బీసీలకు వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. రెడ్ బుక్ పేరుతో సమాజంలో అరాచకత్వాన్ని ప్రేరేపిస్తుండటంతో శాంతిభద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను తుంగలోకి తొక్కి ప్రజాస్వామ్య విలువలను కాలరాశారని నిప్పులు చెరిగారు. ముఖ్యంగా పోలీస్ వ్యవస్థను టీడీపీ కీలుబొమ్మగా మార్చి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రతను ఉద్దేశపూర్వకంగా విస్మరించడమే కాకుండా మంత్రులు, నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడటాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని, కుటుంబ సభ్యులను కించపరుస్తూ కూటమి నాయకులు, ఐటీడీపీ కార్యకర్తలు మాట్లాడుతున్న తీరు జుగుప్సాకరమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజల నుంచి పుట్టిన పార్టీ అని, ఒకరికి వెన్నుపోటు పొడిచి లాక్కున్నది కాదన్నారు. గత ఎన్నికల్లో 40 శాతం ఓటర్లు వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారన్న విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుంచుకుంటే మంచిదన్నారు. రెడ్ బుక్ పేరుతో బెదిరిస్తే భయపడే వారు ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలకు రాయితీ విడుదల

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం రాయితీ కింద రూ.6.44 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టర్ చైర్మన్‌గా అధ్యక్షత వహించిన డీఐఈపీసీ సమావేశం స్థానిక ప్రకాశం భవన్లోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు 293 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. అందుకుగానూ రూ.6.44 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసిన వివిధ శాఖలకు చెందిన 861 అనుమతులలో 841 అనుమతులు మంజూరు చేశారన్నారు, మిగిలిన 20 అనుమతులు కూడా పరిశీలనలో ఉన్నాయన్నారు. అనుమతుల కోసం వేచి ఉండకుండా వెంటనే మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పీఎంఈజీపీ పథకం అమలులో ప్రకాశం జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులు ఎలాంటి పరిశ్రమలు నెలకొల్పుతున్నారో వాటి మీద సమీక్ష నిర్వహించాలన్నారు. పీఎంఈజీపీ పథకంలో బ్యాంక్ వాళ్లు తిరస్కరించిన అప్లికేషన్లను పరిశీలించాల్సిందిగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌ను ఆదేశించారు. బ్యాంక్ వాళ్లు తిరస్కరించిన అప్లికేషన్లను మరోసారి పరిశీలించాలని బ్యాంకర్లను కోరారు. వారంలోగా నివేదిక ఇవ్వాలని జిల్లా పరిశ్రమల అధికారిని ఆదేశించారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. సమావేశంలో పారిశ్రామికవేత్తలతో పాటు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎఫ్ఎంఎస్, ట్యాబ్ నంబర్లు పంపించండి

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు డైట్ కళాశాలలో లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో డైట్ కళాశాలలో కంప్యూటర్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వారికి ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్ నంబర్లు, సీఎఫ్ఎంఎస్ నంబర్లను 9866717186 మొబైల్ నంబర్‌కు పంపించాలని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యం


పూలేకి నివాళులర్పిస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు


పూలేకి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

● మంత్రి సత్యకుమార్‌యాదవ్
● జ్యోతీరావుపూలేకి నివాళులు

ఒంగోలు సబర్బన్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను కొనసాగించడమే వారికిచ్చే నిజమైన నివాళి అని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. మహాత్మా జ్యోతీరావు పూలే 199వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా బలహీన వర్గాలు, కాపు లబ్ధిదారులకు మెగా రుణ మేళా, యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ బలహీనవర్గాలకు అవసరమైన రుణాలు పంపిణీ చేయడంతో పాటు అన్ని రంగాలలో వారి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉన్నాయన్నారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖామంత్రి స్వామి మాట్లాడుతూ బీసీ సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పూలేను స్ఫూర్తిగా తీసుకుని జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్‌ఓ బి.చినఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆదర్శాలు ఆచరణీయం : ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: విద్యతోనే మహిళల సాధికారిత సాధ్యమవుతుందని నమ్మి దేశంలో బాలికల కోసం మొట్టమొదటిగా పాఠశాలను ప్రారంభించిన మహనీయుడు జ్యోతీరావు పూలే అని, ఆయన ఆదర్శాలు ఆచరణీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. మహిళల విద్యతో పాటుగా అనేక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని చెప్పారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ పాటించాలని, ఆయన తీసుకొచ్చిన సామాజిక చైతన్యాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఏఆర్ ఎస్సైలు రవి కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తనయుడిని చంపిన తండ్రి అరెస్టు


● కేసు వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

కంభం: మద్యం మత్తులో గొడవ పడుతున్న తండ్రి ఎక్కడ తన తల్లిని చంపేస్తాడోనని అడ్డుగా వెళ్లిన పద్నాలుగేళ్ల బాలుడు కత్తిపోటుకు బలైన సంగతి తెలిసిందే. అర్ధవీడులో ఈనెల 8వ తేదీ రాత్రి జరిగిన ఈ హత్య కేసులో నిందితుడైన తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కంభం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బాలుడి హత్య కేసు వివరాలను డీఎస్పీ యు.నాగరాజు వెల్లడించారు. మార్కాపురం పూలసుబ్బయ్య కాలనీకి చెందిన షేక్ ఖాశిం అర్ధవీడులో వివాహం చేసుకోగా వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన ఖాశింవలి తరచూ భార్యతో గొడవపడేవాడు. మార్కాపురం నుంచి భార్య అర్ధవీడు రాగా ఖాసిం ఇక్కడ కూడా మద్యం తాగి గొడవ చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీ మద్యం మత్తులో ఉన్న ఖాశింవలి ఇంట్లో వంట గదిలో కత్తిని అడ్డపంచెలో పెట్టుకోవడాన్ని కుమారుడు షేక్ షాకీర్(14) గమనించాడు. తల్లిని రక్షించే క్రమంలో అడ్డుగా వెళ్లిన షాకీర్ చాతిపై తండ్రి కత్తితో పొడవడంతో తీవ్ర గాయమైంది. మార్కాపురం జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం కంభం ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న నిందితుడిని అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్సై సుదర్శన్ యాదవ్ పాల్గొన్నారు.

రైలుకు బ్రేక్.. ప్రాణాలు సేఫ్!

● ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన రైల్వే సిబ్బంది


అయ్యప్పను వైద్యశాలకు తరలిస్తున్న రైల్వే పోలీసులు

మార్కాపురం: కుటుంబ కలహాలు, మానసిక కారణాలతో రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని రైల్వే సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురంలోని విజయ టాకీస్ సమీపంలో నివాసముండే పి.అయ్యప్ప శుక్రవారం ఉదయం మార్కాపురం నుంచి గజ్జలకొండ వెళ్లే మార్గంలో ఔటర్ సిగ్నల్ వద్ద తెనాలి నుంచి మార్కాపురం వైపు వస్తున్న డెమో రైలు కింద పడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. లోకోపైలట్ అత్యవసర బ్రేకులు వేసి రైలును ఆపారు. అయ్యప్ప గాయాలతో బయటపడగా రైల్వే ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ మార్కాపురం పట్టణానికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు తరలించారు.

మోటారుసైకిళ్ల దొంగ అరెస్ట్

● నిందితుడి నుంచి ఏడు బైకులు స్వాధీనం

పొదిలి: వ్యసనాలకు బానిసైన వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో మోటారు సైకిళ్ల దొంగతనానికి అలవాటుపడ్డాడు. పొదిలిలో బైకుల చోరీపై దర్యాప్తు చేస్తున్న పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఎస్సై వేమన కథనం మేరకు.. హనుమంతునిపాడు మండలం మిట్లపాలెం గ్రామానికి చెందిన గుటిపాటి మణికంఠ నూడిల్స్ బండి వద్ద, రెస్టారెంట్లలో వంట మాస్టర్‌గా పనిచేసేవాడు. మద్యం, గంజాయికి బానిసగా మారాడు. చోరీలు చేస్తే ఎక్కువ డబ్బు సంపాదించాలని భావించి, ఈ క్రమంలోనే ఏడు బైకులు అపహరించాడు. పొదిలికి చెందిన గంగవరపు రఘు, పులిగొర్ల వెంకటేశ్వర్లు, నేరెళ్ల ఏడుకొండలు ఫిర్యాదు మేరకు బైకుల చోరీపై విచారణ చేపట్టిన పోలీసులు మణికంఠను నిందితునిగా గుర్తించారు. స్థానిక పొగాకు బోర్డు వద్ద శుక్రవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

జనసేన నాయకుల బాహాబాహీ

అర్ధవీడు: జనసేనలోని ఇరువర్గాలు బాహాబాహీకి దిగిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి కాకర్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కాకర్లలో రంగస్వామి తిరునాళ్ల సన్నాహక సమావేశానికి బెల్లంకొండ సాయిబాబా వర్గానికి చెందిన కాల్వ బాలరంగయ్య మరికొందరు నాయకులు హాజరయ్యారు. అదే సమయంలో ఆమంచి స్వాములు వర్గానికి చెందిన కాసుల పాండు అక్కడికి వచ్చాడు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. కాల్వ బాలరంగయ్య తలకు తీవ్ర గాయం కాగా కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుదర్శన్ యాదవ్ తెలిపారు.